క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు



పూజలు చేయిస్తున్న సమన్వయకర్త రంగయ్య

కుందుర్పి : అపిలేపల్లి బొబ్బర్ల కుంట ఆంజనేయస్వామికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య గురువారం పూజలు నిర్వహించారు. స్వామి రథోత్సవంలో భాగంగా తలారి రంగయ్య పాల్గొని, పూజలు చేయించారు. ఆయన వెంట మండల కన్వీనర్ హనుమంతరాయుడు, ఎంపీపీ నాగరాజు, తాలూక మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ, స్థానిక సర్పంచ్ అతావుల్లా, జిల్లా కార్యదర్శి పెద్దపయ్య, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, ఎస్సీసెల్ తాలూక అధ్యక్షుడు తిప్పేస్వామి, మరిస్వామి, విశ్రాంత ఆర్ఐ చిరంజీవి, నాయకులు భీమప్ప, రమేష్, అడినప్ప, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై నిరసన

రాయదుర్గంటౌన్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం చేసిన తీవ్ర అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 20 వరకు నిరసనలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బీజేపీ ఏపీకి చేసిన ద్రోహాన్ని నిరసనలో ఎండగట్టనున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజా సంఘాలు భాగస్వామ్యులై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. రాష్ట్రానికి బడ్జెట్‌లో ఏమాత్రం ప్రయోజనం చేకూరకపోయినా టీడీపీ, జనసేన పార్టీలు ఎందుకు మౌనంగా ఉన్నాయో ప్రజలకు తెలియజేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కోశాధికారి రాయుడు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడానికి సీత, ఎంఎల్ న్యూ డెమోక్రసీ సంఘాలు ఈ నెల 23న విలీనమవుతున్నాయన్నారు. అనంతరం సంఘాల విలీన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల సమైఖ్య ఐఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, మండల నాయకులు సంజప్ప, ఈశ్వరయ్య, పార్థసారథి, సంగప్ప, రామాంజనేయులు, చౌడప్ప పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ

కళ్యాణదుర్గం రూరల్: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ యువరాజ్ సూచించారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ యువరాజ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ లైసెన్స్, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు మద్యం తాగి నడపరాదని, యూనిఫాం తప్పక వేసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

- రాకెట్ల పీహెచ్‌సీ వైద్యులు అవగాహన



రాయంపల్లిలో వడ దెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని రాయంపల్లిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, హెల్త్‌ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ మాట్లాడుతూ గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందినట్లు నివేదిక ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుండడంతో ఉదయం 7 నుంచి 12 గంటల లోపు పనులు ముగించుకోవాలన్నారు. వేసవి ప్రారంభం నుంచే ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగుతూ ఎండ నుంచి రక్షణ పొందడానికి గొడుగు, టోపీలను వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, హెల్త్ అసిస్టెంట్ నిమ్మల వెంకటేష్, ఏఎన్ఎం సలీమా, ఆశాలు పాల్గొన్నారు.



డ్రోన్ యంత్రంలో మందు నింపుతున్న రైతులు

ఉద్దేహాళ్ వద్ద డ్రోన్‌తో రసాయన మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

డ్రోన్ సాయం

గ్రామీణ ప్రాంత రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు అడుగులు వేస్తున్నారు. పాత సాగు విధానానికి స్వస్తి పలికి.. అధునాతన సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించుకుంటున్నారు. సేద్యంలో కొత్త ఒరవడితో అధిక దిగుబడి సాధించేలా ఆలోచిస్తున్నారు. సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకితే డ్రోన్ ద్వారా రసాయన మందులు పిచికారీ చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. డ్రోన్ పరికరాలతో సరికొత్త సాంకేతికత జోడించి మందులు పిచికారీ చేస్తూ సమయంతోపాటు ఖర్చు ఆదా చేస్తున్నారు. నష్టాలను అధిగమించి ఆదాయం ఆర్జించేందుకు కృషి చేస్తున్నారు.

- మందుల పిచికారీలోనూ నూతన సాంకేతికత
- సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా
- అన్ని రకాల పంటలకు అనుకూలం
- గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి చూపుతున్న రైతులు

బొమ్మనహాళ్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో రబీ సీజన్‌లో వరి, మిరప, వేరుశనగ, పత్తి, జొన్న, మొక్కజొన్న, మామిడి, అరటి తదితర పంటలు అధికంగా సాగు సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో కూలీల కొరత వల్ల డ్రోన్లతో వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది. రసాయన మందులు పిచికారీ చేసుకోవడానికి డ్రోన్లు ఉపయోగించి, ఖర్చు తగ్గించుకుంటున్నారు. 5 ఎకరాల పంటకు మందులు పిచికారీ చేయాలంటే రూ.1,500 ఖర్చు అవుతుంది. వేలాది లీటర్ల నీటితోపాటు సుమారు 6 గంటల సమయం పడుతుంది. అదే డ్రోన్ సాయంతో మందులు పిచికారీ చేస్తే గంటలోపు పూర్తి చేసుకోవచ్చు.

కూలీల కొరతతో అవస్థలు..

పంటలు సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం. పంటలు సాగు చేసిన 20 రోజుల నుంచే పురుగు మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే మందులు పిచికారీ చేసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో సకాలంలో మందులు పిచికారీ చేయకపోతే సాగులో నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. అంతేకాక కూలీలతో మందులను పిచికారీ చేయడం ఖర్చుతో కూడుకున్న పని అయ్యింది. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

ఖర్చుతోపాటు సమయం ఆదా..

పంటల సాగులో ఆధునిక టెక్నాలజీని వినియోగించి, తద్వారా సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా చేసుకోవచ్చు. అనుకున్న సమయానికి పంటలకు మందులను పిచికారీ చేయొచ్చు. ఇందుకు ఎకరాకు కేవలం రూ.500 తీసుకుంటున్నారు. అదే కూలీతో మందు పిచికారీ చేసేందుకు ఎకరాకు ముగ్గురు కూలీలు రూ.1,500 ఖర్చు వస్తుంది. ఎక్కువ సమయం పడుతుంది. దీంతో గ్రామీణ ప్రాంత రైతులు డ్రోన్ల వినియోగంపై ఆసక్తి కనబరుస్తున్నారు.

పనిభారం తగ్గింది



పంటలకు డ్రోన్ల ద్వారా రసాయన మందులు పిచికారీ చేస్తుంటే పని భారం తగ్గుతోంది. అంతేకాక మందులు వృథా కావడం లేదు. అలాగే పైనుంచి మందు పిచికారీ చేయడంతో పంట మొత్తం తడుస్తుంది. దీంతో తెగుళ్ల త్వరగా నివారణ అవుతున్నాయి. తక్కువ సమయంలో పని పూర్తి చేసుకుంటున్నాం.

– ప్రసాద్‌రెడ్డి, రైతు, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

సబ్సిడీతో డ్రోన్లు



డ్రోన్లను 80 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. మండలానికి ఇద్దరు రైతులకు 12 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించి, 80 శాతం రాయితీతో వారికి డ్రోన్లను అందించనుంది. పంటలకు మందులను పిచికారీ చేసుకోదలసిన రైతులు వారి వద్దనుంచి డ్రోన్లను అద్దెకు పొందొచ్చు. మరో రెండు, మూడు నెలల్లో ఈ కార్యాచరణ పూర్తి కానుంది.

– సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

పెచ్చుమీరుతున్న అధికార పార్టీ అరాచకాలు



వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: అధికార పార్టీ అరాచకాలను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే డీటీ శ్రీరాములుకు గురువారం వినతిపత్రం అందించారు. బోరంపల్లి రైతు ధనుంజయరెడ్డి తన పొలంలోని బోరు పక్కన గతంలో అదే గ్రామానికి చెందిన సతీష్ బోరు వేశాడు. దీనిపై గతంలో ధనుంజయరెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ .. బోరుబావి పక్కనే మరో బోరు తవ్వడం సరికాదని, మోటారు బిగించొద్దని సూచించారు. దీంతో అప్పట్లో సమస్య సద్దుమణిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సతీష్‌ను ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టి బోరు మోటారు ఏర్పాటు చేయిస్తున్నారు. దీనిపై బాధిత రైతు ధనుంజయరెడ్డి తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సుధీర్, మండల కన్వీనర్ గోళ్ల సూరి, కంబదూరు జెడ్పీటీసీ గుద్దిళ్ల నాగరాజు, జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు షేక్షా, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, కిరీటియాదవ్, వెంకటేశులు, ఉదయ్, జగదీష్ పాల్గొన్నారు.

మసీదుల్లో షబే బరాత్ ప్రార్థనలు



కణేకల్లులోని ఈద్గా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు షబే బరాత్ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అల్లాహ్ మన్నింపు, కారుణ్యం కురిసే రాత్రిగా ముస్లింలు పవిత్రంగా షబే బరాత్ జరుపుకుంటున్నారు. గురువారం రాత్రి ఇషా నమాజ్ తరువాత రాత్రంతా జాగారం చేస్తూ ప్రత్యేక నమాజులు ఆచరించారు. తమ పూర్వీకుల మగ్ఫిరత్ (మన్నింపు) కోసం దువా చేశారు. షాబాన్ నెల 15న రాత్రి అల్లా ప్రవక్త మహమ్మద్ జీవితంలో జరిగిన ఘటనను పురస్కరించుకుని షబే బరాత్‌గా జరుపుకోవడం ఆనవాయితీ. పట్టణంలోని జామియా చౌక్ మసీదు, మక్కా మసీదు, కుబా మసీదు, దర్గా మసీదు, గౌసెఆజం, దర్గా మసీదు, టిప్పు, బిలాల్ తదితర మసీదుల్లో షబే బరాత్ ప్రార్థనలు జరిగాయి. మసీదుల ఇమామ్‌లు షబే బరాత్ ప్రాముఖ్యతను వివరించారు. మరో 15 రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభమవుతుందని, ఉపవాస దీక్షలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కణేకల్లులో ఘనంగా షబేబరాత్

కణేకల్లు: కణేకల్లులో షబేబరాత్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఏటా షాబాన్ నెల 15వ రోజున షబేబరాత్‌ను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. షబేబరాత్‌ను పురస్కరించుకొని ముస్లింలు మసీద్‌ల్లో రాత్రి ప్రత్యేక నమాజ్‌లు, దువా చేశారు. జామియా, నూరానీ, ఫిర్దోష్, ఈద్గా మసీద్, మదీనా, ఆయిషా, మక్కామసీద్‌తోపాటు వివిధ మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చదివి, రాత్రంతా జాగరణ చేశారు. ముస్లింలు ప్రతి ఒక్కరూ రాత్రంతా అల్లాను స్మరిస్తూ జాగరణ చేశారు. ఈసందర్భంగా మౌలానా, హాఫీజ్‌లు ముస్లింలనుద్దేశించి మాట్లాడారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను ఆచరించి సన్మార్గంలో నడవాలన్నారు. షబేబరాత్ సందర్భంగా మసీదులన్నీ ముస్లింలతో కిక్కిరిసిపోయాయి.

17న వాల్మీకుల ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వీజీఆర్ కొండయ్య

కళ్యాణదుర్గం: అనంతపురంలో ఈనెల 17న జరిగే వాల్మీకుల ర్యాలీని జయప్రదం చేయాలని ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వీజీఆర్ కొండయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వాల్మీకి భవన్‌లో వాల్మీకి యువతతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చి నెలలవుతున్నా వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే విషయం మరుగునపడిందన్నారు. రాజకీయ పార్టీల్లో వాల్మీకి ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 17న అనంతపురంలోని వాల్మీకి మహర్షి విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వాల్మీకులు ర్యాలీకి హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంవీఆర్పీఎస్ యూత్ నాయకులు పూజారి అనీల్, ఓంప్రకాష్, సురేంద్ర, మంజు, అంజి, మద్దిలేటి, రామాంజి, రవి, సూరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ధామం.. బూదిగుమ్మ క్షేత్రం



హనుమంతరాయస్వామి మూలవిరాట్

బెళుగుప్ప:మండలంలోని బూదిగుమ్మ క్షేత్రం ఆధ్యాత్మిక ధామంగా వెలుగొందుతోంది. రామసాగరం సమీపంలోని అటు పెన్నానదీ పరీవాహక ప్రాంతం, ఇటు జీడిపల్లి రిజర్వాయర్ మధ్యన ప్రకృతి రమణీయతను చాటుతూ ఆహ్లాదంగా ఉండే ప్రాంతంలో క్షేత్రం వెలసింది. హనుమంతరాయ స్వామి భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు.

నేటి నుంచి ఉత్సవాలు..

బూదిగుమ్మ క్షేత్రంలో హనుమంతరాయస్వామికి ఏటా మాఘమాసంలో నిర్వహించే ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పూజలు, సీతారాముల కల్యాణోత్సవం, పుష్పార్చనలు కొనసాగించనున్నారు. శనివారం రథోత్సవం సందర్భంగా పల్లకీసేవ, పంచామృతాభిషేకాలు, గరుడ స్తంభ దీపారాధన, సాయంత్రం 4.00 గంటలకు రథోత్సవ పూజ అనంతరం భక్తజనసందోహం మధ్య స్వామి రథోత్సవం జరగనుంది. ఆదివారం తెల్లవారు జామున పెన్నా తీరాన గంగ పూజ, వరసిద్ధేశ్వర, అశ్వర్థ దర్శన పూజ, నిత్యం సుందరకాండ పారాయణ కార్యక్రమాలు ఆలయం వద్ద తిరునాల జరుగుతుందని ఈఓ, ఆలయ కమిటీ, అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు, ప్రదాన అర్చకులు, రామసాగరం గ్రామ ప్రజా ప్రతినిధులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



ప్రవచనాలు చెప్తున్న ప్రొఫెసర్ గరికపాటి గురజాడ



పట్టాభి రాములుకు ఉయ్యాలోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

- ప్రొఫెసర్ గరికపాటి గురజాడ

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు కుమారుడు ప్రొఫెసర్ గరికపాటి గురజాడ అన్నారు. పట్టణంలో వెలసిన పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు కారణ జన్ముడైన శ్రీరాముడిగా ఎందుకు అవతరించాడో..ఆయన వైశిష్ట్యాన్ని వివరించారు. ప్రవచనాల కార్యక్రమం ప్రారంభించినప్పటి నుంచి ఆద్యంతం భక్తులు ఎంతో శ్రద్ధగా విన్నారు. అంతకు అనంతరం పట్టాభిరాముడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ గరికపాటి గురజాడను సత్కరించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు అందజేసింది.

అత్యుత్తమ నాణ్యతకు హామీ భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందిస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

కళ్యాణదుర్గం: అత్యుత్తమ నాణ్యతకు హామీ భారతి సిమెంట్ అని కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ మోతిలాల్ నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక విజయ్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజనీర్ మాట్లాడుతూ సిమెంట్ తయారీకి జర్మన్ టెక్నాలజీ రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్‌తో తయారు చేస్తామన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తాపీ మేస్త్రీలకు కట్టడాలపై అవగాహన కల్పించారు. అనంతరం హాజరైన తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్‌ను అందించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ డీలర్ మధుసూదన్, నరేష్, తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగళాముఖి అమ్మవారి రథోత్సవం



విశేష అలంకరణలో వెలిగొండ భగళాముఖి అమ్మవారు

ఉరవకొండ: మండలంలోని వెలిగొండలో వెలసిన భగళాముఖి అమ్మవారు, గురుసిద్ధావధూత బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం భగళాముఖి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, మహామంగళహరతి, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భిక్షాటన గురు మహలింగప్పస్వామి ఆధ్వర్యంలో కొనసాగింది. అనంతరం గురుసిద్ధేశ్వరస్వామి మఠం నుంచి గురు లింగప్పస్వామి గ్రామ ప్రజలు, భక్తులు భగళాముఖి అమ్మవారి ఆలయానికి వెళ్లి జెండా ప్రతిష్ఠ చేశారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా ఎస్ఐ జనార్దన్‌నాయుడు, సిబ్బంది గట్టిబందోబస్తు నిర్వహించారు.



వెలిగొండలో భగళాముఖి అమ్మవారి రథోత్సవం

జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్పకు పరామర్శ

బ్రహ్మసముద్రం : అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప, భార్య గౌరమ్మను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. గురువారం కోనాపురం గ్రామం వెళ్లి పలకరించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న, జిల్లా కోఆర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెస్ హనుమంతరాయుడు, నారాయణ పురం వెంకటేశులు, మహిళా విభాగం నాయకురాలు ప్రియంక, లక్ష్మీ, మాజీ ఎంపీపీ మహదేవప్ప, హరినాథ్‌రెడ్డి, అయ్యన్న, లాయర్ హనుమంతరెడ్డి, మండల యూత్ కన్వీనర్ రాము, నాగభూషణ, మల్లాపురం మల్లికార్జున, నాగరాజు, వెంకి, మంజు, గోవిందు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటిస్తే పుండ్లను అరికట్టొచ్చు

- జిల్లా లెప్రసీ వైద్యాధికారి గంగాధర్ రెడ్డి

కూడేరు: కుష్ఠు వ్యాధిగ్రస్తులు రోజూ అరగంట పాటు కాళ్లు, చేతులు సబ్బునీటితో శుభ్రం చేసుకోవడం ద్వారా పుండ్లు అరికట్టొచ్చని జిల్లా లెప్రసీ వైద్యాధికారి గంగాధర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుష్ఠు రోగుల కాలనీలో అంగవైకల్య నివారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కుష్ఠు వైద్యాధికారి గంగాధర్ రెడ్డి హాజరై అవగాహన కల్పించారు. శర్మంపై రాగి రంగులో స్పర్శ లేని మచ్చలుంటే కుష్ఠు వ్యాధి కావచ్చన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి, చికిత్స పొందితే పూర్తిగా నయం చేయొచ్చని తెలిపారు. అనంతరం వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు సత్యనారాయణ, తిప్పేస్వామి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం భాను, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సర్వ మానవాళికి రుజుమార్గం దివ్య ఖురాన్



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న హాఫీజ్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థి

రాయదుర్గంటౌన్: సర్వ మానవాళికి రుజుమార్గం దివ్య ఖురాన్ అని ముఫ్తీ తౌఖీర్‌సాబ్(చిక్కమంగళూరు) తెలిపారు. గురువారం పట్టణంలోని బళ్లారి రోడ్డులోని జామియా అన్వారుల్ ఉలుమ్ మదరసా 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మదరసాలో 80 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, ముగ్గురికి ఖురాన్ హాఫీజ్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ముఫ్తీ తౌకీర్‌సాబ్ మాట్లాడుతూ ఉత్తమ నడవడికతోపాటు హాఫీజ్, మౌల్వీ, ముఫ్తీ కోర్సులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మదరసా ప్రిన్సిపాల్ ముఫ్తి నూర్ మహమ్మద్, మదరసా కమిటీ అధ్యక్షుడు జిలాన్, సభ్యులు అబ్దుల్ ఖయ్యూంసాబ్, జక్రియసాబ్, మౌలానా మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. మండలంలోని బీటీపీ, తాళ్లకెర, రంగసముద్రం, పూలకుంట, కలుగోడు గ్రామాల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకొచ్చినప్పటి నుంచి కొందరు కేటుగాళ్ల వలలో ఇరు క్కుని సంపాదించుకుని నగదును పోగొట్టుకుంటున్నారన్నారు. వాట్సాప్‌లలో వచ్చే లింకులను క్లిక్ చేస్తే బ్యాంకుల్లోని నగదు మాయమవుతున్నట్లు తెలిపారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సలహాలు, సూచ నలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

శెట్టూరు:యాటకల్లు, శెట్టూరు సచివాలయాల్లో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, బయో మెట్రిక్ హాజరును పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోళ్లషెడ్డుకు నిప్పు

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన మచిం ఖాన్ కోళ్ల ఫారం వద్ద నిప్పు పడి మంటల్లో వస్తువులు కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు కోళ్ల ఫారం వద్ద నిప్పుపెట్టారు. పక్కనే ఉన్న కోళ్లఫారానికి మంటలు వ్యాపించేలోపు ఆర్పివేశారు.అయితే అప్పటికే పక్కనే ఉన్న పైపులు, ప్లాస్టిక్‌నీటితొట్టెలు, దాణా, ఇతర వస్తువులు కాలిపోయాయి. రూ. 50 వేల వరకు నష్టం జరిగింది. బాధితులు పోలీసులకు పిర్యాదు చేశారు.